RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంచిక : 362 | సంపుటి : 02 | ఆదివారం 23-11-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాప్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524



## సేవే ధర్మం..ప్రేమే మార్గం

- తన సందేశాలతో బాబా పరివర్తన
- లక్షల మందికి తాగునీటి వసతి సౌకర్యం
- పేదలకు ఉచితంగా వైద్య సేవల కల్పన
- సాయి శతజయంతి ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు

పుట్టపర్తి,-నవంబర్ 22(అక్షర వేదం సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది.

-మిగతా 2 లో




# లైన్ క్లియర్

### పంచాయతీ రిజర్వేషన్లపై జీవో విడుదల

- స్థానిక ఎన్నికల్లో 50శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు
- రొటేషన్ పద్ధతిలో ఎస్సీ ,ఎస్టీ ,బీసీ మహిళా రిజర్వేషన్లు
- 100% ఎస్టీ జనాభా ఉన్న గ్రామంలో అన్ని స్థానాలు వారికి
- ఎంపీడీవోలకు వార్డు మెంబర్ స్థానాలు...ఆర్డీవోలకు సర్పంచ్ స్థానాల ఖరారు బాధ్యతలు
- వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు



హైదరాబాద్, - -నవంబర్ 22(అక్షర వేదం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం -మిగతా 2 లో




## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

- సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి
- సాయి సమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్

పుట్టపర్తి,

సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 22 విశిష్టత గురించి సీఎం చెప్పగానే వస్తానని చెప్పా. ఇప్పటికే దేశంలో ముగ్గురు ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించారు. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా నాయకులను తయారు చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ ఆహ్వానించగానే అందరూ స్వాగతించారు. విద్యార్థులు దేశ నాయకులుగా ఎదుగుతారనేందుకు ఇదే నిదర్శనం. జీవితంలో ప్రతి రోజూ చాలా కీలకం. మానవ జీవితాలు యాంత్రికంగా, ఆధ్యాత్మికంగా సాగుతున్నాయి. విద్యాసంస్థ ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం నేర్పుతున్నారు.

-మిగతా 2 లో




## ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

- హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ప్రమాదం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

ఇంఫాల్, -

ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని, యునాన్ (గ్రీస్) మిస్ర్ (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కుచెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు

-మిగతా 2 లో

## దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

- ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు నిధులు
- డాక్టర్లే నిధులు సమకూర్చారని గుర్తింపు
- ఢిల్లీ పేలుడు ఘటనపై పలు కీలక విషయాలు వెలుగులో



న్యూఢిల్లీ,

ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమవుతున్న కొద్దీ పలు కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు 2023 నుంచి కుట్రలు పన్నుతున్నట్టు సమాచారం ఇప్పటికే వెలుగులోకి రాగా, ఢిల్లీ పేలుడు కేసులో నిందితులుగా ఉన్న డాక్టర్లే స్వయంగా సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్‌కు నిధులు సమకూర్చినట్టు తాజాగా వెలుగుచూసింది. కేసులో నిందితులైన డాక్టర్లంతా కలిసి రూ.26 లక్షలు సమకూర్చినట్టు తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్ రూ.5 లక్షలు, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్ రూ.8 లక్షలు, డాక్టర్ ముఫర్ అహ్మత్ రాథర్ రూ.6 లక్షలు, డాక్టర్ ఉమర్ రూ.2 లక్షలు, డాక్టర్ షహీన్ సాహిద్ రూ.5 లక్షలు కంటిబ్యూట్ -మిగతా 2 లో

## ఈ నెల 29న దీక్షా దివస్ ఘనంగా నిర్వహించాలి.

### బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



హైదరాబాద్, -నవంబర్ 22(అక్షర వేదం ఈ నెల 29న దీక్షా దివస్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దశాబ్దంన్నర క్రితం, పార్టీ అధినేత కేసీఆర్ 'తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగ నిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఘనమైన ఈ ఘట్టాన్ని పురస్కరించుకొని -మిగతా 2 లో



## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

- వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్
- గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డిజిపి

హైదరాబాద్, - -నవంబర్ 22(అక్షర వేదం మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బులెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో -మిగతా 2 లో




## గుర్తు లేదు.. మర్చిపోయా..!

- పోలీసుల విచారణలో ఐబొమ్మ రవి సమాధానాలు..!
- పోలీసుల విచారణలో సహకరించని రవి
- విదేశీ సంస్థలపై సంబంధాలపై మౌనం
- మూడోరోజు ముగిసిన విచారణ

హైదరాబాద్, -నవంబర్ 22(అక్షర వేదం సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు

-మిగతా 2 లో




## కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

**ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు**

### చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు



- ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచింది.
- ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
- తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుంది
- అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, -నవంబర్ 22(అక్షర వేదం తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా -మిగతా 2 లో

## డీసీసీ అధ్యక్షులను ప్రకటించిన ఏఐసీసీ..



- హైదరాబాద్‌లో ముగ్గురు..!
- వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా దారాసింగ్
- మేడ్చల్ మల్కాజ్ గిరి వజ్రేష్ యాదవ్
- రంగారెడ్డి జిల్లా పెండింగ్ లో..

రంగారెడ్డి - -నవంబర్ 22(అక్షర వేదం చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవులు ఎట్టకేలకు ఖరారు చేసారు. చాలాకాలంగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసినా చివరికి శనివారం రాత్రి ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ జాబితా ప్రకటించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రంగారెడ్డి జిల్లా పెండింగ్ లోనే ఉంది. వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా సీనియర్ కాంగ్రెస్ నేత దారాసింగ్ పేరు ఖరారు చేసారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పగ్గాలు మేడ్చల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్ కు అప్పగించారు.

-మిగతా 2 లో

# సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

మొదటి తరువాయి

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యాసంస్థ విలసిల్లుతోందని ఉప రాష్ట్రపతి అన్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం.. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. వ్యక్తిత్వ కేంద్రంగా సత్యసాయి వర్సిటీ నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో సత్యసాయిబాబా భూమిపైకి వచ్చారు. సత్యసాయి.. భగవాన్ సాయి సిద్ధాంతం వ్యాప్తి చేశారు. క్రమశిక్షణ, ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. భారత్.. వేల ఏళ్లుగా ఆధ్యాత్మిక భావనలతో వర్ధిల్లుతోంది. వసుదైక కుటుంబం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనేది మన సంస్కృతిలో ఉంది. సత్యసాయి విద్యాసంస్థ నైతికత, విలువలతో కూడి ఉంటుంది. విద్యార్థులకు ఆధ్యాత్మికత, సేవాభావాన్ని విద్యాసంస్థ నేర్పిస్తుంది. అందరినీ ప్రేమించాలి.. సేవ చేయాలి అనేది భగవాన్ సాయి సిద్ధాంతం. సహాయ గుణం కలిగి ఉండాలే కానీ, ఎవరినీ నొప్పించవద్దనేది సిద్ధాంతం. సత్యం, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు సూత్రాలు చెప్పారని సీఎం అన్నారు.

# ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

మొదటి తరువాయి

పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా కీలకమని మోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థ్యం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు. ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదని అన్నారు. ఇదేమంత కష్టమైన పని కూడా కాదని చెప్పారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రం సహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు. బ్రిటిష్ వారిపై జరిగిన స్వాతంత్ర్య పోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. 'బ్రిటిష్ సామ్రాజ్యంలో రవి అస్తమించడు. కానీ ఇండియాలో వారి సూర్యుడు అప్పటికే అస్తమించాడు. 90 ఏళ్లపాటు ప్రయత్నాలు సాగించాం. అణచివేతకు ఎన్నడూ తలవంచలేదు. కొన్నిసార్లు మన గళం బలహీనంగా ఉండి ఉండవచ్చు, కొన్ని సార్లు బలంగా వినిపించి ఉండవచ్చు. కానీ మన గళం ఎన్నడూ మూగవోలేదు' అని మోహన్ భాగవత్ వివరించారు.

# దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

మొదటి తరువాయి

చేసినట్టు చెబుతున్నారు. పోగుచేసిన మొత్తం సొమ్మును పేలుడు సామగ్రిని సమకూర్చేందుకు డాక్టర్ ఉమర్‌కు వీరు అందజేశారని దర్యాప్తు అధికారుల సమాచారం. అమ్మోనియం నైట్రేట్, యూరియా, ఇతర కీలక సామగ్రిని డాక్టర్ ముజమ్మిల్ సేకరించాడు. రూ.3 లక్షలతో ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాదాలోని రెండు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఆ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్థాలుగా డాక్టర్ ఉమర్ మహమ్మద్ మార్చాడు. పేలుడుకు అవసరమైన రసాయనాలు, రిమోట్లు, అవసరమైన పరికరాలను సమకూర్చే బాధ్యత డాక్టర్ ఉమర్ తీసుకున్నాడు. మరోవైపు, అల్-ఫయిదా యూనివర్శిటీ వ్యవహారంపై విస్తృతంగా జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో ల్యాబ్ నుంచి స్టూడెంట్ ప్రాజెక్టుల పేరుతో పలు కెమికల్స్, గ్లాస్‌వేర్ చోరీ అయినట్టు తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, టెస్టింగ్ కిట్లు మాయమైనట్టు గుర్తించారు. నిందితులు చిన్న చిన్న మొత్తాల్లో వీటిని బ్యాగులు, వాహనాల్లో యూనివర్శిటీ నుంచి తరలించినట్టు గుర్తించారు.

## ఈ నెల 29న దీక్షా దివస్ ఘనంగా నిర్వహించాలి.

మొదటి తరువాయి

దీక్షా దివస్‌ను పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ జనరల్ బాడీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దీక్షా దివస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శనం చేశారు. దీక్షా దివస్ నిర్వహణకు ముందుగా, ఈ నెల 26వ తేదీన అన్ని జిల్లాల పార్టీ కేంద్రాల్లో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సహా ఇతర కీలక నాయకులందరినీ ఆహ్వానించాలని ఆయన ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశాల ముఖ్య ఉద్దేశం, నవంబర్ 29న పార్టీ ఘనంగా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. నవంబర్ 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని అన్ని జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లోనే నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఒక రోజు ముందుగా, అంటే 28వ తేదీ సాయంత్రంలోగా జిల్లా కేంద్రాలు, పట్టణాలను బ్యానర్లు, ఫ్లెక్సీలతో అలంకరణ పూర్తి చేయాలని.. పార్టీ కార్యాలయం ప్రాంగణాన్ని కూడా సుందరంగా అలంకరించాలని సూచించారు. జిల్లాలోని ముఖ్య నాయకులందరికీ ప్రత్యేకంగా సమాచారం అందించి, కనీసం 1000 మంది కీలక పార్టీ నేతలతో ఈ సమావేశాన్ని నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

# డీసీసీ అధ్యక్షులను ప్రకటించిన ఏఐసీసీ..

మొదటి తరువాయి

రంగారెడ్డి జిల్లాకు సంబంధించి పోటీ తీవ్రంగా ఉండటంతో పెండింగ్ లో పెట్టారు. డీసీసీ అధ్యక్ష పదవి కీలకం కానుంది. ఏ ఐసీసీ వీరికి కీలక అధికారాలు కట్టబెట్టింది. రానున్న రోజుల్లో డీ సీసీలు కీలకం కానున్నారు. అందుకే డీసీసీ నియామకాల్లో పారదర్శకతను పాటించారు. ఢిల్లీ నుంచి దూతలను పంపి అందరి అభిప్రాయాలను తెలుసుకొని అందులో ఆరుగురి పేర్లు హస్తిన పెద్దలకు పంపించారు. అందులో ఫిల్టర్ చేసి చివరికి ముగ్గురి పేర్లు ఫైనల్ జాబితాలో చేర్చారు. మొత్తం మీద డీసీసీ అధ్యక్షుల పేర్లు ఖరారు చేసారు

# లైన్ క్లియర్

మొదటి తరువాయి

రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు.

# సేవే ధర్మం..ప్రేమే మార్గం

మొదటి తరువాయి

దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు



కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు. ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

మొదటి తరువాయి

వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు. అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. . తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం




నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు. ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్


మొదటి తరువాయి

ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు.

# గుర్తు లేదు.. మర్చిపోయా..!

మొదటి తరువాయి

పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు




చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

# పొరుగుసేవల ఉద్యోగులు ఇఎస్ఐ సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి:ఆర్జీ.త్రీ జి.ఎం

**అక్షర వేదం:నవంబర్ 22,రామగిరి**


పొరుగుసేవల ఉద్యోగులు ఇఎస్ఐ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.శనివారం జి.ఎం కార్యాలయం నందు పొరుగుసేవల (కాంట్రాక్టు) ఉద్యోగుల కోసం ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఇ.ఎస్.ఐ) క్రింద కాంట్రాక్టు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు సదుపాయాలపై సంబధిత కాంట్రాక్టర్ల కు అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు క్రింద పని చేయు పౌర నిర్వహణ,మరమ్మత్తు పనులు,హౌస్ కీపింగ్, భద్రత,రవాణా,తోటల పెంపకం,నర్సరీలు వంటి ఉద్యోగాలను పొరుగుసేవల క్రింద పనిచేయు వారిని దృష్టిలో పెట్టు కొని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా సహాయ,సహాకారములు అందజేయుట,విధి విధానంపై సంబధిత కాంట్రాక్టర్ల లకు ఈ అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా ఇఎస్ఐ స్కీం బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లడుతూ సింగరేణి పొరుగుసేవాల క్రింద పని చేయు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ స్కీం ద్వారా వైద్య చికిత్సను అందించాలని గతంలో కాంట్రాక్టర్ల ఉద్యోగుల సంఘాలు నుండి వచ్చిన




ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకొని ఇఎస్ఐ పోర్టల్‌లో కాంట్రాక్టర్,వారి ఉద్యోగుల నమోదుపై అందించే ప్రయోజనాల దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకోవడానికి కాంపిటెంట్ అథారిటీ ఆమోదం తెలిపినది,ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం సామాజిక బీమా రాష్ట్ర బీమా చట్టం,1948 లో నిర్వచించిన విధంగా 'ఉద్యోగులను' అనారోగ్యం,ప్రసూతి,ఉద్యోగుల గాయాలు అకాల మరణం మొదలగు వంటి వాటి నుండి బీమా చేయబడిన వ్యక్తులకు,వారి కుటుంబాలకు వైద్య సంరక్షణ అందించడానికి రూపొందించ బడినదని తెలిపారు.కాంట్రాక్ట్ లో పని చేయు ఉద్యోగులు నెలవారీ జీతం రూ.21,000/- కంటే తక్కువ, ఉద్యోగులతో పాటు వారిపై ఆధారపడిన వారికి వర్తించే తక్కువ ఆదాయ వర్గ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు,ఇతర అనారోగ్య ప్రయోజనాలను విస్తరించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ల ను స్థాపించిందని,ఉద్యోగి వైద్య ఖర్చుల భారం పడకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుందని,కాంట్రాక్టర్లు ఈ విషయాలపై అవగాహన పెంచుకొని కాంట్రాక్టు ఉద్యోగులకు తెలియజేయాల్సిందిగా కోరారు.కార్యక్రమంలో ఎస్వోటు జిఎం బండి సత్య నారాయణ,సివిల్ డిజిఎంరాజేంద్ర కుమార్,డివై పిఎం వి.సునీల్ ప్రసాద్,డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ శ్రీహర్ష,వివిధ గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది,కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు గృహ నిర్మాణ సంస్థలో ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం

**-తెలంగాణ రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్**



**హైదరాబాద్, నవంబర్ 22 (అక్షర వేదం) :**

ఎస్టీ ఉద్యోగులను తీవ్ర వివక్షకు గురి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహణ సంస్థ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ను వెంటనే సస్పెండ్ చేసి కొత్త మేనేజింగ్ డైరెక్టర్ నియమించాలని తెలంగాణ రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ డిమాండ్ చేశారు. అలాగే ఎస్టి ఉద్యోగులు జరిగిన అన్యాలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. గత సంవత్సరం కాలంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహణ సంస్థలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, సూపరిండెంట్ ఇంజనీర్ గా ప్రమోషన్ రావాలన్నారు. రోస్టర్ ప్రకంగా రోస్టర్ నెం.8 న్యాయబద్ధక రాకుండా తన వర్గమైన ఓ వ్యక్తిని రోస్టర్ నెం.11 ద్వారా సూపరిండెంట్ ఇంజనీర్ పోస్ట్ కేటాయించాడని ఆరోపించారు. ప్రభుత్వ ఉత్తర్వులను లెక్కచేయకుండా తన వర్గానికి చెందిన ఆంధ్రా ఉద్యోగులను లక్షల జీతాలు ఇచ్చి నియమించుకున్నాడని ఆరోపించారు. ఎండి ఆగడాలపై ఏసిబి, సిబిఐ విచారణ జరిపించాలన్నారు. న్యూఢిల్లీ ఎస్టి కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారంగా ప్రమోషన్ ఎస్టి ఉద్యోగులకు ఇవ్వాలని చెప్పినా ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే బంజారా సంఘాలు తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహణ సంస్థ ప్రధాన కార్యాలన్నీ ముట్టడించి ధర్నా చేపడతామని అన్నారు. త్వరలోనే డీజీపీ, హెూం శాఖ చీఫ్ సెక్రటరీ, డిప్యూటీ సీఎం కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు.

# కార్మిక సంఘాలు,ప్రతిపక్షాల అభ్యంతరాలు బేఖాతర్

**-29 కార్మిక చట్టాల్ని రద్దు చేసిన మోడీ సర్కార్**
**-కార్పొరేట్లకు ఊడిగం చేసేలా 4 లేబర్ కోడ్స్**
**-తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు**

**అక్షర వేదం:నవంబర్ 22,రామగిరి**

సిఐటియు అద్వర్యమంలో ఆర్ జి- 3 లోనీ ఓసిపి-2 లో నల్ల బ్యాడ్జీలు ధరించి కార్మికులతో కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు ఆర్ జి-3 బ్రాంచ్ ఏరియా కమిటీ కార్యదర్శి దొమ్మటి కొమరయ్య మాట్లాడుతూ,దేశ కార్మిక వర్గం సుదీర్ఘకాలం అనేక త్యాగాలు,ఆందోళనలు, పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు కాలగర్భంలో కలిసి పోయాయని,ఐదేండ్లుగా ఈ చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వం అప్పటి నుంచి కార్మికుల ఆగ్రహజ్వాలలకు భయపడుతూ,వెనకడుగు వేస్తూ వచ్చిందనీ ఆయన అన్నారు.అదేవిధంగా బీహార్‌లో ఎన్డీఏ కూటమికి అత్యధిక మెజారిటీ రావడంతో




కేంద్రంలో కార్పొరేట్ అనుకూల విధానాల అమలు వేగవంతమైందనీ,దానిలో భాగంగానే 29 కార్మిక చట్టాలను రద్దు చేసి,వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తూ,శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.తక్షణం ఈ కోడ్‌లు అమల్లోకి వస్తాయని ప్రకటించిందనీ, వేతనాల కోడ్ (2019),పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020),సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రత,ఆరోగ్యం,పని పరిస్థితుల కోడ్ (2020)లు ఇక అమల్లోకి వచ్చాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. అలగే కార్మికులను కట్టుబానిసలుగా చేసే చర్య, యజమానులకు శ్రమదోపిడి చేసుకోవడానికి చట్టబద్దత కల్పించడం తప్ప వేరేలేదనీ, పనిగంటలు పెరుగుతాయి,సమ్మెహక్కు పోతుందని, కార్మిక సంఘాలు నిర్వీర్యం అవుతాయని,ఉద్యోగభాద్రత ఉండదనీ, కార్మికులకు రక్షణ కవచంగా ఉన్న చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తెచ్చిన కేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికావలసి వస్తుందనీ,వెంటనే లేబర్ కోడ్స్ రద్దు చేసి చట్టాలను కొనసాగించాలని సిఐటియు పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో ఆర్ జి- 3 ఏరియా సిఐటియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు,ఆసరీ మహేష్,ఎన్ రమణా రెడ్డి,జి.మీనయ్య,ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సేజ్ పాఠశాలలో నా మట్టి నా దేశం కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా శ్రీనిధి యూనివర్సిటీ ప్రోఛాన్సలర్‌నరసింహారెడ్డి.**





**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి/ మేడిపల్లి: పిర్జాదిగూడ, నవంబర్ 22,**

మేడిపల్లి లో శనివారం రోజు సీజ్ పాఠశాల ప్రాంగణంలో కార్నివాల్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.నామట్టి - నాదేశం అనే నినాదమును పునాదిగా చేసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా నరసింహారెడ్డి ప్రో చాన్సలర్ శ్రీ నిధి యూని వర్సిటి విచ్చేసారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ ఎస్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల, ఉపాధ్యాయుల కృషిని ప్రశలసిస్తూ అభినందించారు.సేజ్ పాఠశాల విద్యార్థులందరూ సమిష్టిగా శ్రమించి సమగ్ర భారతావనిని ఈ కార్నివాల్ లో ఆవిష్కృతం చేశారు.భాషలు, సంస్కృతులు, వైద్య, రవాణ, కృత్రిమ మేధస్సు లాంటి అనేకమైన ప్రాచీనం నుండి నేటి ఆధునిక ల వరకే కాకుండా భవిషత్ లో ఎలాంటి సాంకేతికత రాబోతుందో తమ నమూనాల ద్వారా విదార్థులు ఈ కార్నివాల్ లోప్రదర్శించారు.ఈ నమూనాలు విద్యార్థుల తల్లి దండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమములో ప్రిన్సిపల్ చైత్రరెడ్డి, అకాడమీ డైరెక్టర్ సీతామహాలక్ష్మి, డైరెక్టర్ రోహిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమమును విజయవంతం చేసినందుకు విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతూ నామట్టి - నాదేశం అనే నినాదాన్ని ప్రతిజ్ఞ చేశారు.

# నాణ్యతలో రాజీ పడకుండా త్వరగా పనులు పూర్తి చేయండి

**బోడుప్పల్ 5వ డివిజన్లో నూతన సిసి రోడ్డు పనులు ప్రారంభం**
**పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి:బోడుప్పల్,నవంబర్ 22,బోడుప్పల్**

మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ భీమ్ రెడ్డి నగర్ కాలనీ శివాలయం రోడ్డులో నూతన సిసి రోడ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పనులను పర్యవేక్షించారు. డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని అన్నారు, నాణ్యతలో రాజీ పడకుండా త్వరగా పనులు పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్కు సింగిరెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పబ్బు సత్యనారాయణ, డివిజన్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు కాలనీల..మా సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించండి

**- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి వినతి**
**- జేఏసీ గౌరవ అధ్యక్షుడు నోముల మైసయ్య**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/ ఉప్పల్,నవంబర్ 22,**

నాలుగు కాలనీల మధ్య ఎస్టిపి ప్లాంటును ఏర్పాటు చేయడం ప్రభుత్వ అధికారులకు తగదని ఆయా కాలనీల జేఏసీ గౌరవ అధ్యక్షుడు నోముల మైసయ్య అన్నారు. ఇల్ల మధ్యలో ఎస్టిపి ప్లాంటును ఏర్పాటు చేయడంతో తమ కాలనీలకు దుర్వాసనతో,విపరీతమైన దోమలు వచ్చి, రోగాల బారిన పడతామని మా సమస్యను పట్టించుకుని పరిష్కారాన్ని కృషి చేయాలని నాలుగు కాలనీల జేఏసీ సభ్యులు శనివారం రోజు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బిజెపి నాయకుడు బెతి సుభాష్ రెడ్డికి జేఏసి నాయకులు వినతి పత్రం అందజేశారు. మా ప్రాంతంలో ఎస్టిపి ప్లాంటును ఏర్పాటు చేయడంతో,తమ కాలనీలో నివసించే ప్రజలకు, చిన్న పిల్లలకు అనేక రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు ఈ ప్రాంతం నుండి ఎస్టిపి ప్లాంటు యొక్క అలైన్మెంట్ను మార్చాలని తెలిపారు. శనివారం ఉప్పల్ జిహెచ్ఎంసి డీసీకి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బాజా అబ్బయ్య, సలహాదారులు సజ్జనపు సోమయ్య,ట్రెజరర్ బెల్లంకొండ నరసింహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శీలం నరసింహ, రవి, కే రాజా చారి, నరేందర్ నాయక్, కీర్తి శీను, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఓసిపి టు నూతన ప్రాజెక్టు ఆఫీసర్ కు సన్మానం



**అక్షర వేదం నవంబర్ 22,రామగిరి**

శనివారం ఆర్జీ3 పరిధిలోని ఓసిపి టు నూతన ప్రాజెక్టు ఆఫీసర్ రాజశేఖర్ ను ఐఎన్టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్,ఐఎన్టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ ఫిట్ సెక్రటరీ రథం రాజేశం పులి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ బండ కిరణ్ రెడ్డి,ఆర్జీ3 కాంట్రాక్ట్ వర్కర్స్ వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్,కార్మిక నాయకులు భూమయ్య,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి విద్యతోపాటు నైతిక విలువలు చాలా ముఖ్యం



**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అక్షర వేదం /వనపర్తి:**
కొత్తకోట మండలం విలియం కొండ గ్రామం వద్ద రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఆర్ బి వి ఆర్ ఆర్ స్కూల్ అదనపు గదుల భవన నిర్మాణం కోసం, డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్ నిర్మాణం కోసం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ రాయన్ పేట గ్రామంలో1869 ఆగస్టు 22 న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి గారు జన్మించారని ఆయన చిన్నతనంలోనే తల్లి మూడు రోజులకే మరణించిందని తండ్రి ఐదు సంవత్సరలకే మరణించారని అతను ఆయన పాలన మేనమామ వామన్ రెడ్డి చూసుకున్నారని తెలిపారు.వెంకటరామ్ రెడ్డి 16 సంవత్సరాలకే పోలీసు అమీన్ సాబ్ ఎస్సై గా ఉద్యోగం సాధించారని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకోవాలని సంకల్పంతో వెంకటరామిరెడ్డి హాస్టల్ ని స్థాపించారని మేము కూడా హాస్టల్లో ఉండి చదువుకున్నామని తెలిపారు.రాయన్ పేట గ్రామంలో ఆర్ బి వి ఆర్ ఆర్ స్కూల్ లో చదువుకోవడం కూడా మీ అదృష్టమని అన్నారు. సమాజంలో చదువు ఒక్కటే చాలా ముఖ్యమని, ఆ చదువును ఎవరు నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతంగా చదువుకొని ఉన్నత పదవులు స్వీకరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చదువు పై ఎక్కువ శ్రద్ధ పెట్టారని 2024 రైసింగ్ తెలంగాణ అభివృద్ధిలో మీరు ఉండాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీందర్ నాథ్ రెడ్డి , బసిరెడ్డి , వనపర్తి జిల్లా జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు , సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అక్షర వేదం /వనపర్తి:**
దేవరకద్ర నియోజకవర్గం మదనపురం మండల కేంద్రంలో 42 లక్షల నిధులతో 40 కేఎల్ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం అంగన్ వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నదేవరకద్ర ఎమ్మెల్యే .జి. మధుసూదన్ రెడ్డి. మదనపురం మండలం అజ్జకొల్లు గ్రామంలో అగ్రి ఔట్ లేట్స్ మరియు వే బ్రిడ్జ్ ప్రారంభోత్సవంలో డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి స్థానిక పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



**అక్షర వేదం/మంథని,నవంబర్22:**
మంథని మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో విద్యార్థులకు ప్రావీణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి దాసరి లక్ష్మీ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా రెండు రోజులుగా ఇవ్వబడుతున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులందరూ గణితంలో ముఖ్యంగా రాత లెక్కలలో ప్రావీణ్యం సంపాదించేలాగా కృషి చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని మంథని మండలంలోని అన్ని పాఠశాలల్లో విజయవంతంగా అమలు చేయాలని,తద్వారా విద్యార్థుల ప్రగతిని మెరుగుపరచాలని,పెద్దపల్లి జిల్లాలోనే మంథని విద్యా ప్రగతిలో ముందు స్థానంలో ఉండేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా రెండు రోజులపాటు జరిగిన సమావేశాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్,ఈదులపల్లి నరసింహారావు,సురేష్ ప్రణాళిక బద్ధంగా నిర్వహించారు.రిసోర్స్ పర్సన్ లు లోకే రాజ్ పవన్,బోగే చంద్రశేఖర్,మద్ది రాము,నారామల్ల లక్ష్మణ్ లు రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు గణితం లో మెలకువలను,రాత లెక్కలను సాధించడంలో నూతన వ్యూహాలను ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు మల్లన్న,రాధిక, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

# బిజెపి పార్టీని అభివృద్ధి చేస్తా

**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను మేడ్చల్ జిల్లాలో అన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి బిజెపి పార్టీని అభివృద్ధి చేస్తా**

**బిజెపి పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి: నవంబర్ 22,**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను మేడ్చల్ జిల్లాలో అన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి భారతీయ జనతా పార్టీని అభివృద్ధి చేసేందుకు తన వంతు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని నూతనంగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాసు అన్నారు. బిజెపి పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు గురువారం బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నా పై నమ్మకము తో బాధ్యతలు ఇచ్చినటువంటి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావుకి, జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ కి, ఇందుకు సహకరించిన మాజీ మంత్రి వర్యులు మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కి, జిల్లా నాయకులకు, మండల నాయకులకు, బోడుప్పల్ బీజేపీ నాయకులకు, ఈ సందర్భంగా గోనె శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. మేడ్చల్ జిల్లాలో బీజేపీ పార్టీ అభివృద్ధి కోసం నా వంతుగా పూర్తి సమయం ఇచ్చి పనిచేస్తానని, నా పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల కోసం సేవ చేస్తూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లి, మోడీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని.. ప్రతి మండలం లో ని గ్రామ గ్రామనికి వెళ్లి బీజేపీ అభివృద్ధి కి కృషి చేస్తానని శ్రీనివాస్ అన్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ లో మా అధ్యక్షులు తో కలిసి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం నిరంతరం పనిచేస్తాననీ ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# ఖనిలో కన్నెర్రజేసిన సింగరేణి కార్మిక వర్గం

**కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నోటిఫికేషన్ పత్రుల దగ్ధం.**

**కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్ల అమలుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించాలి: మెండె శ్రీనివాస్ ఆర్జీవన్ కార్యదర్శి**



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్22**
కేంద్ర బిజెపి ప్రభుత్వం వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020) నవంబర్ 21, 2025 నుండి అమలు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఆర్జీవన్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని బొగ్గు గనులపై.. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. నోటిఫికేషన్ పత్రులను దగ్ధం చేశారు ఈ సందర్భంగా మెండె శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు గరిష్ట లాభాల కోసం చేసిన, కార్మికుల హక్కులు హరించే నష్టదాయకమైన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్మిక నిబంధనలను, సంక్షేమాన్ని తుంగలో తొక్కి, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే 29 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్లు బిజెపి ప్రభుత్వం తెచ్చిందని. ఆత్మనిర్భర్ పేరుతో బిజెపి ప్రభుత్వం బరితెగించి ఈ చర్యను తీసుకున్నదని. 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా 2020 సం? నుండి 2025 జూలై 9 దేశవ్యాప్త సమ్మె వరకు 5 సం?ల పాటు సమ్మెలు, ఉద్యమాల్లో కోట్లాది కార్మికుల నిరసనలను పరిగణలోకి తీసుకోకుండా నవంబర్ 13న ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాలు లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలని డిమాండ్ చేసినా ఖాతరు చేయలేదన్నారు. శుక్రవారం లేబర్ కోడ్ల అమలుకు రూల్స్ నిర్ణయించడం యాజమాన్యాల దోపిడీకి అంతే లేకుండా పోతుందన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని సింగరేణి యావత్ కార్మికులు సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు కోరుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ అధ్యక్ష కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మేదరి సారయ్య, జెల్ల గజేందర్, పుప్పాల శ్రీనివాసరావు, అనబోయిన శంకరయ్య, వంగల శివరాం రెడ్డి, నంది నారాయణ, ఈదుల సాగర్, పెద్దపల్లి శశికిరణ్, తాళ్లపల్లి శ్రీనివాస్, మహేందర్, మేదరి కుమార్, జనార్ధన్, భీమా నాయక్, సందీప్, బాదే రవి, సంతోష్, కొమ్ము రమేష్, సందీప్, ఐఎఫ్టియు నాయకులు కృష్ణా, నరేష్, రామకృష్ణ, మల్లేష్, చింతల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# గెజిట్ చేసిన లేబర్ కోడ్ల రద్దుకై కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలి

**- మోడీ ప్రభుత్వ నిరంకుశ చర్యలను భారత కార్మిక వర్గమంతా తిప్పి కొట్టాలి: పెద్దపెల్లి జిల్లా టియుసిఐ అధ్యక్షులు తోకల రమేష్, కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ పిలుపు.**




**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్22**
ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ)ఆధ్వర్యంలో ఎన్టిపిసి మెయిన్ గేట్ ఎదురుగా మోడీ ప్రభుత్వం నిరంకుశంగా గెజిట్ చేసిన లేబర్ కోడ్ గెజిట్ పత్రాలను శనివారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్, కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను అమలుల్లోకి తెస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మన సార్వత్రిక సమ్మెలను నిరసన ఆందోళనలను ఖాతరు చేయలేదు. కార్మిక చట్టాలకు వలస పాలన వాసనలు ఉన్నాయని వాటిని ఆధునికరించి అమలు చేసేందుకే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధం. వలస పాలనకు మించి బానిసత్వాన్ని కార్మిక వర్గం మీద రుద్దేందుకు కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసేందుకు నాలుగు లేబర్ కోడ్లలో అనేకమైన కార్మిక వ్యతిరేక మార్పులను చొప్పించారు. అందులో మచ్చుకు ఒక ఉదాహరణ అందరి దృష్టికి తెస్తున్నాం. ఇప్పటివరకు ఏదైనా కర్మాగారం లేదా కంపెనీ లే-ఆఫ్ చేయాలన్నా, లేదా లాకౌట్ చేయాలన్న 100 మంది అంతకుమించి కార్మికులు ఉంటే ఆ సంస్థ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఇప్పుడు ఈ షరతు 300 మంది కార్మికులు ఉన్న కంపెనీలకు ఫ్యాక్టరీలకు వర్తించే విధంగా మార్చారు. అంటే 300 లోపు కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలు కంపెనీల యజమానులు తమ ఇష్టానుసారం పరిశ్రమలను లే-ఆఫ్ లేదా లాకౌట్లు చేసుకోవచ్చు. ఈ విధంగా మూసివేస్తామని బెదిరిస్తూ కార్మికుల హక్కుల మీద ఉద్యోగ భద్రత మీద జీతభత్యాల మీద వేటు వేసేందుకు యాజమాన్యాలకు ఆయుధం ఇస్తున్నారు. ఇలాంటి ఆయుధాలు ఈ లేబర్ కోడ్ల ద్వారా కార్పొరేట్లకు చాలానే అందిస్తున్నారు. అందుకే ఈ లేబర్ కోడ్లను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూ 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం నిరంకుశంగా గెజిట్ చేసిన లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత కార్మిక వర్గమంతా ఐక్యంగా మోడీ ప్రభుత్వ చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా నాయకులు కలవల రాయమల్లు, సదానందం, స్వరూప, రాజయ్య, లత, మధునమ్మ, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వలిమా వేడుక లో పాల్గొన్న మాజీ మంత్రి

**అక్షర వేదం/ వనపర్తి :**
గోపాల్పేట్ పద్మావతి గార్డెన్స్ లో జరిగిన ముజ్జమ్మిల్ వారి సోదరుడు మహమ్మద్ అజారుద్దీన్ వివాహ వలిమా వేడుకలో హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియ చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో పలుస రమేష్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సమద్ స్టార్ రహీం, తిరుమల్, బండార్ కృష్ణ, ఇమ్రాన్ ,ఆరిఫ్ సయాధ్ జమిల్, ముదుసార్, ఆలిం గోపాల్పేట్ మండల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బిజెపి లు బిసిలకు చేసిన మోసం ఫలితమే జీవో 46

**-బీసీలను నమ్మించి మోసగించిన బిజెపి,కాంగ్రెస్ లను చరిత్ర గుర్తుపెట్టుకుంది**
**-బీసీలను సర్పంచ్ లుగా కాకుండా ఆ రెండు పార్టీలు కుట్ర ఫలితమే జీవో 46 విడుదల**
**-కాంగ్రెస్ బిజెపిల మోసాలపై బీసీ సమాజం మేల్కొనాలి**
**-రేపు 23న రాష్ట్రవ్యాప్తంగా జీవో నెంబర్ 46 ప్రతులను దగ్ధం**
**-బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు**




**అక్షర వేదం/ హైదరాబాద్**
తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే సర్పంచి ఎన్నికలలో బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక రిజర్వేషన్లు పరిమితి 50 శాతం మించకూడదనీ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46 విడుదల చేయడానికి తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కాంగ్రెస్ బిజెపిల మోసం ఫలితమే జీవో నెంబర్ 46 విడుదల అయిందని బిసి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతం ఉన్న,బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9ని మొన్నటికి మొన్న విడుదల చేసిందనీ, ఇప్పుడు తొమ్మిది జీవోను రద్దు చేసి 46 జీవో తీసుకొచ్చి బీసీల రాజకీయ అంచవేతకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు రాష్ట్రంలో రెడ్లను ఎక్కువ మంది సర్పంచులుగా చేసి, సర్పంచ్ నుండి ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా ఉన్న వారి ప్రయోజనాల కోసమే జీవో నెంబర్ 46 ఉపయోగపడుతుందని ఈ జీవో బీసీలకు రాజకీయ కొలుతాడు లాంటిదని ఆయన మండిపడ్డారు బిజెపి,కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు పలికారని, రాష్ట్ర బంద్ లో భాగస్వామ్యం అయ్యారని, ఇదే స్పూర్తితో జాతీయ పార్టీలు అయిన వీరు పార్లమెంటులో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదింప చేయడానికి ప్రయత్నం చేసి ఉంటే రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు పెద్దవద్దమైన రిజర్వేషన్లు అమలు జరిగే అవకాశం ఉండేదని, కానీ ఏమి ప్రయత్నించకుండా రిజర్వేషన్ల విషయంలో రెండు పార్టీలు కలిసి బీసీలను బలి పశువు చేశాయని ఆయన ఆరోపించారు జీవో నెంబర్ 46 ను తక్షణమే రద్దు చేయాలని, జీవో నెంబర్ 9 మాత్రమే అమలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు జీవో నెంబర్ 44 విడుదలను వ్యతిరేకిస్తూ రేపు 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జీవో ప్రతులను దగ్ధం చేసి బీసీ సమాజం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ నిరసనను తెలపాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు

(జొర్రిగల శ్రీనివాస్)
బిసి జాయింట్ యాక్షన్ కమిటీ స్టేట్ కన్వీనర్

# చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**- జడ్జి టి శ్రీనివాసరావు**



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్22**
విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషనల్ డిస్టిక్, సెషన్స్ జడ్జి టి శ్రీనివాసరావు అన్నారు. గోదావరిఖనిలోని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసూన అధ్యక్షతన న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ డిస్టిక్, సెషన్స్ జడ్జి టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. నేటి సమాజంలో యువత చెడుమార్గాల బారిన పడుతున్నారని, వాటి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రస్తుతం సెల్ ఫోన్ వాడకం అత్యవసరం తప్ప అనవసర సమయాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారని అందులో వచ్చే మోసపూరిత ప్రకటనలు నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. విద్యార్థులు చదువుకుంటూనే జీవితంలో స్థిరపడే విధంగా లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే గ్రామాల్లో తెలియని వారికి మీరే అవగాహన కల్పించాలన్నారు. వరకట్న సమస్యలు ఎదురుకాకుండా జాగ్రత్త పడాలని ఎలాంటి సమస్యలు ఉన్న న్యాయ సేవ సంస్థ సంప్రదించాలన్నారు. యుక్త వయసులో చెడు మార్గాలు భయభ్రాంతులకు గురికాకుండా జీవితంలో స్థిరపడేందుకు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలని జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికారి సంస్థ పానల్ లాయర్ జి భూమయ్య, న్యాయవాది జె అమరేశ్వర రావు, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అపురూపంగా నవజ్యోతి హై స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**-ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**
**-పూర్వ విద్యార్థుల కలయిక తీపి జ్ఞాపకాలు మోసుకొస్తుందన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**అక్షర వేదం కుత్బుల్లాపూర్, నవంబర్ 22**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పట్వారీ నగర్లో ఉన్న నవజ్యోతి హై స్కూల్ 40 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా... వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా... పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ...పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు తీపి జ్ఞాపకాలు పంచుకునేందుకు... ఒకరికి ఒకరు చేదోడుగా ఉండేందుకు పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు చక్కటి వేదికలుగా నిలుస్తాయని...నలభై ఏళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు నవజ్యోతి పాఠశాల యాజమాన్యంను అభినందిస్తూ...శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమ్మేళనంలో నవజ్యోతి పాఠశాలలో చదివిన పూర్వ



విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్ళ తర్వాత కలిసిన తమతోటి విద్యార్థులను చూసి ఆనందాశ్చర్యలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నవజ్యోతి విద్యా సంస్థల చైర్మన్ మలిరెడ్డి ఇందిరా రవీందర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్లు రూపాంజలి, ఆదిత్య కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన వధువును ఆశీర్వదించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**అక్షర వేదం/ వనపర్తి:**
మెట్టుపల్లి(6వ వార్డు)కు చెందిన సుగూరు.లక్ష్మీ వెంకటస్వామి కూతురు పద్మావతి వివాహం ఆదివారం జరగనున్నది.శనివారం ప్రధానం సందర్భంగా వారి స్వగృహంలో నూతన వధువు పద్మావతిని ఆశీర్వదించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, రంగం. చంద్రయ్య, రంగం. నరసింహ,సింగణమోని.గోపాల్,కవితా నాయక్, రంగం. రాములు, ఫ్యాషన్.శ్రీను, జమదగ్ని, బాలస్వామి తదితరులు ఉన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు పర్యటన ఖరారు

**అక్షర వేదం/మంథని,నవంబర్22:**
భూపాల్ పల్లి నియోజకవర్గంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్ కుదురుపల్లి లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.మంథని నియోజక వర్గంలో మధ్యాహ్నం మూడు గంటలకు కాటారం, మహా ముత్తారం,మహా దేవపూర్, మలహర్రావు, పలిమెల మండలాలకు సంబంధించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని బిఎల్ఎం గార్డెన్ లో మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అదే విధంగా నాలుగు మండలాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి చెక్కులు




పంపిణీ చేయనున్నారు.సాయంత్రం నాలుగు గంటలకు పలిమెల మండలంలో 20 లక్షలతో లెంకల గడ్డ గ్రామపంచాయతీ శంకుస్థాపన ప్రారంభోత్సవం చేయనున్నారు.సాయంత్రం 4:30 గంటలకు పలిమెల మండలంలో 20 లక్షలతో నిర్మించిన పలిమెల గ్రామపంచాయతీ ప్రారంభోత్సవం, పలిమెల లో 31లక్షలతో నిర్మించిన మండల్ రిసోర్స్ సెంటర్ ఎంఆర్సి ప్రారంభోత్సవం చేయనున్నారు. 32 లక్షలతో నిర్మించిన పలిమెల అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించనున్నారు.సాయంత్రం 5:00 గంటలకు పలిమెల మండలంలో కోటి 50 లక్షలతో నూతనంగా మంజూరైన మండల పరిషత్ కార్యాలయానికి శంకుస్థాపన పలిమెల వద్ద 20 లక్షలతో మంజూరైన దమ్మూరు గ్రామపంచాయతీ శంకుస్థాపన చేయనున్నారు..

# చెత్తను కాలిస్తే జరిమాన: కమిషనర్



**అక్షరవేదం/ గోదావరిఖని: నవంబర్22**
చెత్తను కాల్చడం వలన పర్యావరణంపై దుష్ప్రభావం పడుతుందని ప్రజల్లో అవగాహన కల్పించడానికి జిల్లా నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్ ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెత్తను తగలబెట్టడం నేరమని ఇందుకు ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్, తెలంగాణ పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్ గూళ్ళ అంజన్ కుమార్, నగర పాలక సంస్థ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ పాల్గొన్నారు.




# డిసిసి అధ్యక్షుడిగా రాజ్ ఠాకూర్

**- జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పగ్గాలు మరొకసారి రామగుండం ఎమ్మెల్యే రాజ్ టాకర్కు కట్టబెట్టిన ఏఐసీసీ**

**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 22**
రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ ను వరించిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు..శనివారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. పెద్దపల్లి జిల్లాకు అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వైపే ఏఐసీసీ మొగ్గు చూపింది. ఈరోజు ఎఐసిసి ప్రకటించిన జిల్లాల అధ్యక్షులలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు అన్ని రకాలుగా సి.ఎం రేవంత్ రెడ్డి జిల్లా



మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అండదండలతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నందుకు పెద్దపల్లి జిల్లాకు రెండవసారి డిసిసి అధ్యక్షుడిగా రాజ్ ఠాకూర్ నియమించారు. జిల్లా నాయకులు, రామగుండం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



# సౌత్ లో రీ ఎంట్రీకి రెడీ అవుతున్న శ్రద్ధా కపూర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ దక్షిణాది ప్రేక్షకులను మళ్లీ పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. సాహో వంటి పాన్ ఇండియా సినిమాతో ఇప్పటికే సౌత్ లో తన పరిచయాన్ని పెంచుకున్న శ్రద్ధా, తన రీ-ఎంట్రీ కోసం ఒక విభిన్నమైన చిత్రాన్ని ఎంచుకున్నారు. తన కెరీర్ ప్రారంభం నుండి సొంత గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న శ్రద్ధా కపూర్, గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటూ జాతీయ స్థాయిలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచారు. ఆషికి 2తో గుర్తింపు తెచ్చుకొని, సాహోతో పాన్ ఇండియా స్టార్‌గా మారారు. ఇటీవలే స్త్రీ 2తో లేడీ ఓరియెంటెడ్ జోన్రాలో కూడా తనదైన ముద్ర వేశారు.



## జోరు పెంచిన కళ్యాణి ప్రియదర్శన్



# వాటిని చూసి షాకయ్యా

సాంకేతికత సమాజానికి ఎంత మంచి చేస్తుందో అంత చెడు కూడా చేస్తుంది. మనసుల్లో మలినం పేరుకుపోయిన మనుషుల చేతికి సాంకేతిక వస్తే అది సమాజానికే ప్రమాదం.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు 'మహానటి' కీర్తిసురేశ్. ఆమె తాజా సినిమా 'రివాల్వర్ రీటా' ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె తన వ్యక్తిగత జీవితంపై టెక్నాలజీ ఎలాంటి చెడు ప్రభావం చూపించిందో వెల్లడించారు.'ఏఐ చేసిన డీప్ ఫేక్ ఫొటోలకు బలైన సినీ సెలబ్రిటీలలో నేనూ ఒకదాన్ని. ఈ టెక్నాలజీని ఉపయోగించి నేను ధరించిన డ్రెస్‌ని మార్చేశారు. నేను అసభ్యకరమైన పోజులిచ్చినట్టు క్రియేట్ చేశారు. చూడ్డానికే అసహ్యంగా ఉన్న ఆ ఫొటోలను చూసి షాకయ్యాను. నేను వివాహితను. ఒకరి ఇల్లాలిని. అలాంటి నాపై ఇలాంటి ప్రయోగాలు చేయడం నన్ను మరింత బాధించింది.' అంటూ వాపోయారు కీర్తి సురేశ్.




# 'విత్ లవ్' టీజర్ విడుదల!

### హీరోగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు..

టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు అభిషన్ జీవింత్ ఇప్పుడు హీరోగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'విత్ లవ్' . ఈ సినిమాకు మదన్ దర్శకత్వం వహిస్తుండగా.. మలయాళీ బ్యూటీ అనస్వరా రాజన్ కథానాయికగా నటిస్తుంది. ప్రముఖ నటుడు రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టైటిల్ టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ టీజర్ చూస్తుంటే లవ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్, శరవణన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# నవంబరు 28న థియేటర్‌లోకి రానున్న రాయ్ లక్ష్మీ 'జనతాబార్'!

ప్రముఖ కథానాయిక రాయ్ లక్ష్మీ ప్రధాన పాత్రలో రూపొందుతున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'జనతాబార్'. రోచి మూవీస్ పతాకంపై రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో, అశ్వర్థ నారాయణ సమర్పణలో నిర్మాణం జరుపుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ చిత్రాన్ని ఈ నెల 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రమణ మొగిలి మాట్లాడుతూ: స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్న మహిళలపై, ఆ క్రీడా విభాగంలో ఉన్న ఉన్నతాధికారులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న లైంగిక వేధింపులకు (సెక్సువల్ హరాస్‌మెంట్) చరమగీతం పాడటానికి పోరాడిన ఒక మహిళ కథే ఈ సినిమా. ఈ చిత్రంలో రాయ్ లక్ష్మీ పాత్ర ఎంతో శక్తిమంతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో పాటు, సమాజానికి మంచి సందేశంతో పాటు మహిళల్లో చైతన్యం నింపే సినిమా ఇది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ ఈ చిత్రంలో ఎంతో శక్తివంతమైన పాత్రను పోషించారు. తప్పకుండా ఈ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.